# భవిష్యత్తు కోసం...

తోట వెంకటాద్రి

(సోమారావు, పెళ్ళాం పెరిందేవి కెదురుగా కూర్చొని కాఫీ తాగుతూ ఉంటాడు)

పెరిందేవి: మన భీమారావు అన్నయ్యకు మగ పిల్లవాడు పుట్టేడట.

సోమారావు: భీమారావుకు పిల్లవాడెట్లా పుట్టాడు? ప్రకృతి విరుద్ధమైన మాట మాట్లాడుతున్నావే! అయినా అది సంభవమే. ఎందుకంటే పూర్వకాలం ఒకానొక రాజు, ఋషులిచ్చిన మంత్రోదకాన్ని, అర్ధరాత్రి పూట దాహమైతే తాగి గర్భం దాల్చాడట. ఇటీవల నార్వేలో ఒక సైనికుడికి స్త్రీత్వం సంభవించిందట. అమెరికాలో మొగవాళ్ళను ఆపరేషను ద్వారా ఆడవాళ్లనుగా చేస్తున్నారట. అటువంటిదేమైనా మన భీమారావుకు సంభవించిందా యేం? మనిషి నిన్న నేగా కనపడింది బాగానే ఉన్నాడుగా!

పె: అదికాదు భీమారావు అన్నయ్యభార్య ఉందే, ఆమెకూ.

సో: మొదట్లోనే ఈమాట చెప్పకూడదూ. నీకింకా తర్కశాస్త్ర పరిచయం లేదు. ఇంకా ముడి సరుకుగానే ఉన్నావు. నిన్ను యంత్రంలో వేయందీ లాభంలేదు. అయినా ఆ విషయంలో కొత్తేముంది? భీమారావు భార్య గర్భం ధరించినప్పుడే, ఆమె తప్పకుండా ఆడపిల్లనో, మొగపిల్లవాణ్ణో కంటుందనే విషయం స్థిరపడిపోయింది. అది నీకూ, నాకూ అందరికీ తెలిసిందేగా!

పె: అయితే ఫలానా అప్పుడు ప్రసవించిందనే మీ కిప్పుడు చెప్పేది.

సో: భేషయిన పనిచేశావు. అయితే ఇప్పుడే వెళ్ళి భీమారావును అభినందించి రావాలిసుమా!

(అంతలో భీమారావే అక్కడికొస్తాడు)

పె: అదుగో అన్నయ్యే వచ్చాడు.

సో: సుప్రభాతం,సుప్రభాతం! అభినందనాలభినందనాలు. పెరిందేవీ! నువ్వుగూడా భీమారావు నభినందించు.

భీ: ఏమిటేమిటి?

సో: ఇప్పుడే నీమాట చెప్పుకుంటున్నాం. మాటలోనే వచ్చావ్. ఒక్కక్షణం తక్కువగాకుండా నిండా నూరేళ్లు బ్రతుకుతావు. పెరిందేవీ! మీ అన్నయ్యకు కాఫీ యివ్వ కొంచెం. కూర్చోరా కూర్చో ఆ చాపమీద. మన సంసారానికింకా మంచాలూ, కుర్చీలూ అమరలేదు లే.

పె: ఎప్పుడో ఒకప్పుడు అమరుతాయని ఆశమాత్రం ఉందిలే.

భీ: ఏమిటోయ్ ఈ హడావుడి? యెందుకీ అభినందన పరంపరలు?

సో: అసలేం తెలియనట్లే మాట్లాడతావేమిరా? అభినందనాలు, అభినందనాలు!

భీ: ఏమిటో నాకంతా అగమ్యగోచరంగా ఉంది.

పె: (కాఫీతెచ్చి) తాగన్నయ్యా కాఫీ!

భీ: వద్దమ్మాయి నాకు.

సో: యేమిటది? కాఫీవద్దనే వాడీ ప్రపంచంలో ఉన్నాడట్రా? చిట్టచివరకు యెందుకూ పనికిరాని పల్లెటూళ్లుగూడా కాఫీ మయమై పోతే నిప్పుడు! "పిక్కల్ పట్టుకపోవు ప్రొద్దుటను కాఫీ వచ్చి, యీ గొంతుకన్ గ్రుక్కెండైనను జారకున్న యెడ..." కాసీ!

భీ: నాకా పట్టింపులేమీ లేవబ్బా. నేను కాఫీ మానేసి దాదాపు యేడెనిమిది నెలలయింది. అయినా యెందుకీ లేనిపోని ఆచారాలు చస్తూంటే?

సో: చస్తూంటేనే మళ్ళీ పుడుతూండేది. ఈ విషయం నీకింకా తెలియదులే. తాగుతాగు ఆరిపోతుంది.

పె: ఈ వేళటి కొక్కసారి తాగుదురూ!

సో: యిప్పుడే మీ చెల్లెలు చెప్పింది. ఏమిటట్లా చూస్తావ్? చెప్పవేం? నవ్వవేం? ఆడవేం?

భీ: ఎందుకూ?

సో: మళ్లీ యెందుకంటావేమిట్రా? నీ విషయం నీకు తెలియదుట్రా?

పె: చెప్పడానికి సిగ్గేమో మా అన్నయ్యకు.

సో: కొడుకు పుట్టాడని చెప్పడానికి సిగ్గెందుకూ? నేనయితేనా యీపాటికి గోడలమీద కాయితా లతికించి, పత్రికలకుగూడా పంపి యావత్ ప్రపంచానికీ యెరుగజేసి ఉండేవాణ్ణి.

పె: తల్లీ పిల్లవాడూ కులాసాయేగా అన్నయ్యా?

భీ: కులాసాయే యింతవరకూ.

సో: అభినందనా లభినందనాలు.

పె ఏం పేరు పెడతారు?

భీ: ఏమో, అది వాళ్ళ యిష్టానికొదిలేద్దాం.

సో: ఏం పేరైతే ఏం పెరిందేవీ? పేరులో యేముంది? బెర్నార్డుషా అన్నట్లు గులాబీ పువ్వును యింకో పేరుతో పిలిస్తేమాత్రం దాని వాసన యెక్కడికి పోతుంది?

పె: బెర్నార్డుషా కాదు ఆ మాటన్నది షేక్సిపియరు. మూడో నెలన తీసుకురా రన్నయ్యా వదెన్ను?

భీ:' అవునమ్మాయ్! తీసుకురావాలి. యెల్లకాలం వాళ్ళుంచుకుంటారా?

సో: ఇంకా అడుగుతావేం? తీసుకురాదూ మరి? కొడుకుని చూచుకొని ఉవ్విళ్లూరదూ? అప్పుడే యేమయింది?

భీ: నాకంత యిదిగా లేదురా!

సో: ఎందుకనీ? వచ్చీ రాని మాటలూ, ఉడికీ ఉడకని వంకాయకూరా మహారుచిట.

భీ: ముందా వంకాయ కూరుంటే, వచ్చీ రాని మాటల ఆనందం సంగతి తరవాత చూడొచ్చు.

సో: ఏం అలాఅంటావ్?

"అనుదిన సంతోషణములు
జనితశ్రమ, తాప, దుఃఖ సంశోషణముల్
జనకుల సంభాషణములు
తనయులకుం"—పొరపాటు, పొరపాటు!
"తనయుల సంభాషణములు
జనకులకుం గర్ణయుగళ సద్భూషణముల్"

అని అల్లసాని పెద్దన ఊరికే అన్నాడా?

పె: అల్లసాని పెద్దనగాదండీ, బమ్మెర పోతన అన్నది.

సో: పొరపాటు, పొరపాటు. ప్రమాదో ధీమతామపి. నిజంగా అదృష్ట వంతుడవంటే నువ్వేరా భీమూ!

భీ: యెందువల్లనంటావ్?

సో: యెందువల్ల నంటావేమిటి నీ మొహం? ముసలితనంలో సుఖించాలంటే, వయస్సులో సంపాయించిన డబ్బన్నా ఉండాలి; లేకుంటే వయస్సులో పుట్టిన కొడుకైనా ఉండాలి.

భీ: అవన్నీ అట్టే నిజంగావు భాయీ!

పె: అన్నయ్య చూశారూ! అందరి మాదిరి మనిషి కాదండీ! మిన్ను విరిగి మీదబడ్డా పైకి పొంగని స్వభావం సుమా అన్నయ్యది.

"నిండుచేరు పారు నిలిచి గంభీరమై
వెర్రి వాగు, పారు వేగిరముగ" అన్నట్లు.

సో: అదేగాకుండా పెరిందేవీ! యింకో విషయం గూడా ఉంది. యేమిటంటే:

"పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుడు జన్మించి నపుడె పుట్టదు; జనులా
పుత్రుని గనుగొని పొగడగ
పుత్రోత్సాహంబు నాడు పొందును వేమా!

అన్నట్లు చూశావ్!

పె: ఆ పద్యం సుమతీ శతకం లోదండీ! యేమి టీవేళ బహు పరాకు చిత్తగిస్తున్నారు?

సో: పొరపాటు, పొరపాటు. పొరపాటన్నది మానవుడన్నవాడు చేయకుండా ఉండలేడని నా అభిప్రాయం.

పె: అయితే యెల్లప్పుడూ చేయడం మంచిది గాదని నా అభిప్రాయం.

సో: సరే! యేమిరా! నీ కొడుకు పెరిగి, పెద్దవాడై, ప్రయోజకుడైతే అప్పుడు నీ కెక్కడ లేని సంతోషం కలుగుతుందని నాఅభిప్రాయం. అప్పుడు నీ ఉత్సాహాన్ని పట్ట పగ్గాలుండవు.

భీ: నీ అభిప్రాయం కొంతవరకు సరైనదేనని నా అభిప్రాయం. అయితే కొడుకు పెరిగి పెద్దవాడై, ప్రయోజకు డవుతాడనే గ్యారంటీ యేముంది?

సో: నీ అభిప్రాయం నాకర్థంగాలా. పుట్టింది మొదలుకొని ప్రతి ప్రాణికీ క్షణక్షణం ఆయుస్సు తరిగి పోతుంది గదా. వాడు పెరుగుతూన్న కొద్దీ, మరణానికి దగ్గర బడుతున్నాడు గదా యెందుకీ ఝంఝాటం అంటావా? నువ్వొట్టి పెస్సిమిస్టు లాగున్నావే!

భీ: అదిగాదు. నువ్వు చెప్పిన వేదాంతం నీకూ, నాకూ పెరిందేవికీ అందరికీ తెలుసు. అందులో కొత్తగా నేర్చుకోవాల్సింది యేమీ లేదు. దాన్ని గూర్చి విచారించడం లేదు గూడాను.

సో: విచారించడం శుద్ధ తెలివి తక్కువ గూడాను.

భీ: తప్పకుండా. అయితే మామూలు విషయం మాట్లాడుదాం. కొడుకు పెరిగి, పెద్దవాడై ప్రయోజకుడెట్లా అవుతాడా అన్నదే యిప్పుడు పట్టుకున్న సమస్య.

సో: యేం?

భీ: విను చెబుతా! దంపతులు సంతానాన్ని కాంక్షించడం సహజం. తమ రక్తంలో రక్తం తమ మాంసంలో మాంసం, ఒకవస్తువు ముందు తమ తెలివి తేటల్నీ, తమ ఆస్తిపాస్తుల్నీ పొందడానికి ఉండాలని ఆరాట పడుతూ ఉంటారు.

సో: నాకా ఆరాటం యీ షణ్మాత్రం లేదు. పెరిందేవీ! నీకేమయినా ఉందేమో నాకు తెలియదు.

పె: మనకు తెలియని విషయం అంటూ ఉందా?

భీ: ప్రతివారికీ ఉంటుంది. మీరు పైకి యెంత గంభీరంగా అన్నా, మీ హృదయంలో 'అయ్యో పిల్లలు లేరే' అని రహస్యంగా యెప్పుడూ కాకపోయినా ఒకప్పుడైనా బాధ పడుతుంటారనే విషయం ఒప్పుకుంటారా?

సో: వాదంకోసం నేనొప్పుకుంటున్నాను.

పే: ఆవిషయంమీద మళ్లీ వాదం రాకుండా చేయడానికి నేనొప్పుకుంటున్నాను.

భీ: ఇందులో వాదప్రతివాదనల ప్రసక్తే లేదు. మానవుడన్నవాడు ముఖ్యంగా దాంపత్య జీవనం చేస్తున్నవాడు ఒప్పుకొని తీరవలసిందే యీ విషయాన్ని. అయితే సోమూ! ఒకటి గమనించావా?

సో: ఏమిటది?

భీ: కొడుకు పుట్టాడనే సంతోషం, ఆ ఉత్సాహం, నాకు మాత్రం లేవంటావా? నేను మానవజన్మ యెత్తలేదంటావా? అయితే ఆ కొడుకు భావిజీవితంలోకి తొంగిచూస్తే ఏమేమి కనబడతాయో నీకు తెలుసా?

పె: వారికి తెలియని విషయం యీ పధ్నాలుగు లోకాల్లో యెక్కడా లేదని నా అభిప్రాయం.

సో: నువ్వు కొంచెం ఊరుకుని, నీపని నువ్వు చూసుకుంటే మంచిదని నా అభిప్రాయం.

భీ: ఇందాక నువ్వు అన్నావు: ముసలితనంలో సుఖపడాలంటే వయస్సులో సంపాదించుకొన్న డబ్బన్నా ఉండాలనీ, లేకపోతే వయస్సులో పుట్టిన కొడుకైనా ఉండాలనీ. మనం మన తల్లిదండ్రుల్ని ఎంతవరకు పోషించి సుఖపెడుతున్నామో ఆలోచించు. ఎవరైనా చుట్టం యింటికొచ్చాడా అంటే నెత్తిమీద పిట్టపిడుగు పడ్డట్టుంటుంది మనకిప్పుడు. మన కూట్లో రాయి మనం తీసుకోలేకుండా ఉన్నాం. మెతుకుబోతే బతుకు పోతుందన్న దుస్థితిలో ఉన్నాం మనమిప్పుడు. వాళ్లకోసం మన తలిదండ్రులు సంపాయించుకొన్న డబ్బు మాత్రం యేముంది? మనకు తెలియందేమీ లేదు. ముందు మనపనీ, మన కొడుకులపనీ. యిట్లా కాదనే గ్యారంటీ యేమన్నా ఉందా? సంతానం కలిగినందుకు మానవనైజ గుణం సంతోషపడటం కాని ఒక ఫ్రెంచి నవలాకారుడన్నట్లు 'యిదో సంతోషకరమైన యిక్కట్టు.'

సో: ఎమిలీ జోలాయేగా ఆ మాటన్నది?

పె: కాదు కాదు, చంపేశారు. గుస్టావ్ ఫ్లాబర్టు ఆ మాటన్నది.

భీ: కొడుకు పెరిగి, పెద్దవాడయ్యే వరకూ, వాడిపోషణకూ చదువుకూ, మనంబడే తిప్పలూ, మానసికవ్యథా, యెట్లాఉంటాయో ఊహించు. మనం యేట్లా పెద్దవాళ్ళమయ్యామో నీకు తెలియదూ? మనమాదిరిగా మన సంతానం గూడా చదువు సంధ్యలకోసం యెన్ని అగచాట్లు పాలు గావాలో్న! వారాలు తింటూ, మునిసిపలు

లైట్ల దగ్గర చదువుకోవాలేమో! పుస్తకాలకూ, బడిజీతాలకూ ఆ లేతవయస్సులోనే యెంతమందిని బిచ్చమెత్తాల్నో! యేదైనా రోగం నొప్పి వస్తే యెవరు చూస్తారు చెప్పు? మన మాదిరిగా ఉద్యోగాలకోసం వాళ్ళెన్ని తిప్పలు బడాల్నో! లంచాల కోసం పెళ్ళాల మెడల్లోని మంగళసూత్రాలు అమ్ముకోవలసి వస్తుందేమో! దారీ, తెన్నూ, గానక, విసుగెత్తి చద్దామని మిలటరీలో చేర్తారేమో! మనమాదిరి అర్థాకలితో, నివాసయోగ్యంగాని మురికి కూపాల్లో ఎంతగా అటమటిస్తారో! ఇంకా ఆడపిల్లలు పుడితే ఎట్లా ఉంటుందో మన గతి! దాని పెండ్లయిందాకా మనం పడే ఇబ్బందులూ, అవమానాలూ, అపనిందలూ మనం చూడ్డంలే? దానికి దాని ఇష్టంవచ్చిన వాణ్ణి పెండ్లి చేసుకునే అవకాశం లేదు. తెస్తే వండిపెట్టడం, చస్తే ముండమొయ్యడంకన్నా, మన కూతుళ్లు పడే సుఖమేముంది? మనం పిల్లల్ని కని వాళ్ళను సుఖపెట్టేదీ లేదు, మనం సుఖపడేదీ లేదు. అసలు పుట్టకపోతేనే నయం.

సో: తలిదండ్రులకు తమ పిల్లలమీద ఉండే ప్రేమ అచంచలం, అనిర్వచనీయం, అమోఘం. తమ పిల్లల బాగోగులకోసం తలిదండ్రులు సర్వత్యాగాలు చేస్తారు. తీగెను కాయలు బరువు గాదన్న విషయం నీకూ, నాకూ పెరిందేవికీ అందరికీ తెలుసు. తలిదండ్రుల మహత్తర ప్రేమ గాథల్ని మనం సినిమాల్లో చూడ్డంలా!

పె: సినిమాల్లోనూ, నాటకాల్లోనూ మీరు చదువుతూన్న పుస్తకాల్లోనూ బోలెడు హంగామా ఉంది. వాస్తవిక జీవితంలో మాత్రం...

భీమా: అవును సోమూ! తల్లిదండ్రుల ప్రేమ నువ్వు చెప్పిన విశేషాలన్నిటితోనూ కూడుకుని ఉంటుందనడంలో సందేహం లేదు. వారు తమ సంతానం కోసం సర్వత్యాగాలు చేస్తారనేది నిర్వివాదమైన విషయమే. అయితే, వాస్తవిక జీవితంలో చేతగాని ప్రేమలవల్ల యే పని అవుతుంది? తీగెను పురుగుబడితే కాయల గతి ఏమవుతుందో అందరకూ తెలుసు.

సో: తీగెను పురుగుబడితే కాయల రక్షణార్థం మందు వేసేది. ఇదేం పెద్ద బ్రహాండమైన విషయమా?

పె: అ మందన్నది ప్రతి ఒక్కడికీ దొరకడం లేదనే యీ మొత్తుకోళ్ళన్నీ.

భీ: సరే! నేడు మనం చూస్తున్నాం. తలిదండ్రులు తమ సంతానాన్ని నదుల్లో పారేసుకోవడం; అంగడిలో అమ్ముకోవడం; పిల్లల్ని ప్రపంచ దయాదాక్షిణ్యాలకు వదలిపెట్టి తాము ఆత్మహత్య చేసుకోవడం; ముందు తమ పిల్లలకు విషం తినిపించి, తాము తినడం; దేనివల్ల నంటావ్ ఇదంతా? వీళ్ళంతా నిజమైన మానవులు గారా? వీళ్ళకు తమ సంతానం అంటే ప్రేమలేదా? వీళ్ళవిమాత్రం తలిదండ్రుల హృదయాలు కావా? సర్వాన్నీ జయించగల ప్రేమ, దైవ సమానమనుకునే ప్రేమ, తలిదండ్రులకు తమ పిల్లలమీదుండే సహజమైన ఆ ప్రేమ, ఆ వాత్సల్యం, ఆ అనురాగం, ఆ మమకారం, ఇవన్నీ ఆ సమయంలో ఎటు పోతున్నాయి? మా యింటి పక్కాయన కూతురుకు పిల్లలేరని, వాళ్లు నోయరాని నోములు నోస్తున్నారు, పట్టరాని వ్రతాలు పడుతున్నారు. మొన్న రామేశ్వరం గూడా వెళ్ళొచ్చారు.

సో: ఒక్క రామేశ్వరం ఏం కర్మం? 'మాయా ద్వారకావంతి' కాశీ కురుక్షేత్ర గయా ప్రయాగములు' గూడా సేవిస్తారు. మన వేదాంతం ప్రకారం అపుత్రస్యగతిర్నాస్తనీ, పున్నామనరకంనుండి తప్పించుకోవాలనీ, వారు పుత్రకామేష్టి చేయడానికైనా వెనుదీయరు.

పె: వారికంత సత్తా ఉంది గూడాను.

భీ: మనకు పుట్టేవాళ్లు ఆ భాగ్యవంతుల గృహాల్లో పుడితే సుఖపడతారు. పిల్లలులేని భాగ్యవంతులంతా దిక్కులేని పిల్లల్ని పెంచుకోగూడదూ? మనం పిల్లల్ని గని వాళ్ళను ఘోరమైనదుస్థితికి లోనుజేయడం తప్పితే, వాళ్ళ జీవితాలు మన జీవితాలకన్నా మిన్నగా ఉంటాయనే నమ్మకం యేముంది మనకు? నానాటికీ తీసికట్టు నాగంబొట్లూ, అసలు మనం పెండ్లి చేసుకోకుండానే, యేదో ఇట్లాగే జీవిస్తూ, బలం ఉడిగిపోయి పనీపాటూ చేయలేని పరిస్థితిలో, యింత విషం మ్రింగి

చావడం మంచిదనుకుంటాను. అప్పుడు పిల్లల అవసరం ఉండదు, వయస్సులో డబ్బుకోసం బండచాకిరీ చేయనవసరమూ ఉండదు.

పె: యీ విషయంలో మాత్రం నీతో నేను యేకీభవించడం లేదన్నయ్యా! నీ యీ సూచన ప్రజా సమస్యలు పరిష్కరించలేని యే ప్రభుత్వానికన్నా నచ్చుతుంది కాని యింకెవ్వరికీ నచ్చదు. నీ సలహా ప్రకారం ప్రతివాడూ నడుచుకొంటే కొంత కాలానికి సమాజం నిర్మానుష్యం అవుతుంది. మనకు సంతానం కావాలి. మనం నిర్మించిన ఆదర్శాన్నీ, విజ్ఞానాన్నీ, అభ్యుదయాన్నీ ముందుకే ముమ్ముందుకే తీసుకెళ్లి అభివృద్ధి చేయడానికి మనకు సంతానం కావాలి. నవగ్రహాల్తోనూ, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సంబంధాలు పెట్టుకోడానికి మనకు సంతానం కావాలి. ప్రాతలోని మంచినంతా పిండి, క్రొత్తలో కలిపి వినియోగించుకోడానికి మనకు సంతానం కావాలి.

సో: ఈ పనులన్నీ మనుషులు చేయకపోతే దెయ్యాలొచ్చి చేస్తయ్యా అట్లా?

పె: చేయకుండా ఊరుకుంటే వాటంతటవి అవుతయ్యా అట్లా? - అన్నయ్యా! యీ సమాజ వ్యవస్థలో యీ దురంతాలూ, ప్రకృతికి విరుద్ధమైన యీ కార్యాలూ, యీ చెడు ఆలోచనలూ కలగడంలో ఆశ్చర్యం లేదు. సుదీర్ఘమైన సమాజ పరిణామంలో యిదిగూడ ఒక సహజమైనదశే. అయితే ఈదశ యిలాగే అంటి పెట్టుకొని ఉండదు. మారుతుంది, మారగలదు, మారితీరాలి. ఈ మార్పన్నది క్రమేణా కావచ్చు. ఒక్కొక్కసందర్భంలోఆకస్మికంగా కూడా కావచ్చు. పరిస్థితుల ప్రాబల్యంమీద ఆధారపడి ఉందది. అట్టి పరిస్థితుల్ని సమాజంలో నేడు మనం యెదుర్కొంటున్న చెడుగులు కల్పిస్తాయి.

భీ: యేమో నమ్మాయ్! దుర్భర బాధల్లో మునిగి తేలుతున్న వాళ్ళకు యీ ఆలోచనలన్నీ తట్టవు. ఓర్పన్నది క్షీణించి పోతుంది. ఒక విషయంచెబుతా: అన్నాబెల్ బ్యూకరు మీకు తెలిసే ఉంటుందనుకుంటా!

సో: మనకు తెలియక పోవడమేమిటోయ్! ఒక్క అమెరికాకు తప్ప సమస్త ప్రపంచానికి తెలుసామె.

భీ: అన్నాబెల్ బ్యూకరు మనలాంటి ఓ మామూలు మనిషే. అయితే సోవియటు దేశంలో పుత్రుణ్ణికని యెందుకుసంతోషిస్తుంది? తన కొడుకు ఓ నూతన వ్యవస్థలో, ఓ నూతన ప్రపంచంలో పుట్టాడని సంబర పడుతుంది. ఆమె యిట్లా అంటున్నది: "తల్లినిగా నేను చెబుతున్నాను. నాకొడుకు యెటువంటి ప్రపంచంలో జీవిస్తున్నాడో నేను చూస్తున్నాను. ఈదేశంలో వాడికి ఉజ్జ్వలమైన [illegible] ఉంది. మరే యితర దేశంలోగూడా లేని సౌభాగ్యవంతమైన, సంపూర్ణమైన, స్వేచ్ఛాజీవితం జీవిస్తాడు నాకొడుకు. నామాదిరి కష్టాలు పడకుండా వాడు యెంతవరకు చదువుకోవాలని నిర్ణయించుకుంటాడో, అంతవరకు నిరాటంకంగా విశిష్టమైన చదువు చదువుకుంటాడు. పనికోసం నాకొడుకు బజార్లు పట్టుకొని తిరిగే పనే లేదిక్కడ. పెట్టుబడిదార్ల లాభాలకోసం నా కొడుకు తుపాకి కాహారం అవుతాడన్నభయం నాకే కోశానా లేదు."

సో: ఇంకా యేమన్నదంటే: సోవియట్ యూనియన్‌లో ప్రజలు...

భీ: సోమూ! మన కెంతవరకు కావాలో అంతవరకే తీసుకుందాం. తన్నుగూర్చీ తన కొడుకునుగూర్చీ ఆమె ఆ దేశంలో యింతగా యెందుకు చెప్పుకోవాల్సి వచ్చింది? నాకు కొడుకు పుట్టినప్పుడు ఆ మాటలు నానోటినుండి యెందుకు రాలేదు? అన్నాబెలు బ్యూకరు అమెరికాలోనే ఉంటూ అక్కడే ఆమె తన కొడుకును కన్నట్లయితే నా మాదిరిగా యెంత బాధపడేదో! వాడి భవిష్యత్తుకోసం యెంత తహతహ లాడిపోయేదో!

పె: అట్లా ఆమె అక్కడ అనుకోవడంలో ఆశ్చర్యంలేదు.

భీ: ఎక్కణ్ణో సోవియటు దేశంలోని పరిస్థితి తలుచుకొని మనం యెందుకు సంతోషించాలి? నా స్వదేశంలో నా స్వగ్రామంలో, నా స్వగృహంలో నాకు కొడుకుపుడితే పుట్టాడన్న సంతోషమే యెందుకు పుట్టకపోవాలి?

సో: అక్కడిది సోషలిస్టు వ్యవస్థ. మిగతా ప్రపంచంలోది కొద్దిపాటి హెచ్చు తగ్గులతో

పెట్టుబడదారి వ్యవస్థ. సిద్ధాంతరీత్యా పరిశీలించి నట్లయితే సోషలిస్టు వ్యవస్థలో పని చేయని వాడు సోమరిపోతు. అటువంటివాడక్కడ బ్రతకడానికే అనర్హుడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో సోమరిపోతులే మహా భాగ్యవంతులు, చేస్తానన్నా పని దొరకదు. అథవా పని దొరికినా దానివల్ల కడుపు నిండదు. ఆ వ్యవస్థలో మానవుని సర్వహక్కులకూ ప్రభుత్వమే గ్యారంటీ యిస్తుంది. ఈ వ్యవస్థలో హక్కుల మాట అటుంచి, ఎవడంతటవాడే యింతపని చేసుకుని బతకాలి. దీన్నే మనం స్వయంకృషి అంటాం. లేకపోతే చావాలి. ఇదే యిందులో ఉన్న గమ్మత్తు. ఆ వ్యవస్థలో కడుపునిండా తిండి దిని సుఖించడం సహజం అయితే, ఈ వ్యవస్థలో పస్తులు పండుకొని చావడం సహజం. అసలు ఆదిమ కమ్యూనిస్టు వ్యవస్థనుండి చూచినట్లయితే...ఇవన్నీ పెద్ద విషయాలు, మీకంతు బట్టవులే.

పె: మన కంతుబట్టినా కలిగే ప్రయోజనం గూడా యేమీ లేదు. అందుకనే యీ వ్యవస్థలో బ్రతకడానికి చేస్తున్న పోరాటం సిద్ధాంతరీత్యా ఆచరణరీత్యా గూడా సహజమే. మన భవిష్యత్తుకోసం మనం పోరాడ్డం సహజమే. పీడక పీడితులమధ్య సంఘర్షణా సహజమే.

(వీథిలోంచి కోలాహలం, జయ జయ ధ్వానాలు వినొస్తాయి)

సో: ఏమిటూ కలవరం?

భీ: కలవరం కాదురా! మనవాళ్ల మీటింగు కాదూ యీ వేళ. బహుశా అది ఊరేగింపు కావచ్చు. పోవాలి మనం మాటల సందట్లో మరిచే పోయాం.

(అంతలో రామారావు ప్రవేశం)

భీ: ఇదుగో రామారావుగూడా వచ్చాడు.

రా: ఏంరా యింకా కూర్చున్నారేం? బయలుదేరండీ! నువ్విక్కణ్ణే ఉన్నావా భీమూ?

భీ: అవున్రా రామూ!

రా: ఏంరా సోమూ! మిడిగుడ్లేసుకుని అట్లా చూస్తున్నావేం కదలు! ఉం! మిమ్మల్ని బొట్టు పెట్టి పిలవాలా? యేం? ఇది మనందరి సమస్య కాదూ! లేండి!

సో: నేనెందుకులే!

పె: ఏమిటి వెనకా ముందాడతారు? నేనెందుకు లెమ్మంటే అర్థం? మీరూ వెళ్లాలి.

రా: అమ్మాయ్ నువ్వు గూడా రా! మన కార్మికుల భార్యలూ, గుమాస్తాల భార్యలూ అంతా బయలుదేరారు స్వయంగా మొరబెట్టుకోడానికి. పాపం మన హెడ్‌గుమాస్తాగారు గూడా యెనిమిది పిల్లల్ను వెంటేసుకుని కడుపుతో ఉన్న భార్యతోసహా ప్రదర్శనంలో పాల్గొంటున్నారు. ఏం అమ్మాయ్!

పె: వస్తాను. (భర్తతో) పదండి ముందు మీరు!

సో: నేనింటిదగ్గరుంటా, నువ్వు పోయిరా!

రా: అదేంట్రా అట్లా అంటావ్?

సో: నేను రాకపోతే మాత్రం జరిగే పని జరక్కుండా ఉంటుందా? 'మానవులు తమ చరిత్రను తామే నిర్మించుకుంటారు; అయితే వాళ్ళిష్టం వచ్చినట్లు కాద'ని ఫ్రెడరిక్ యెంగిల్సు అంటున్నాడు.

పె: ఫ్రెడరిక్ యెంగిల్సు కాదు ఆమాటంటున్నది కారల్ మార్క్సు. 'పతితమానవులు తమ హక్కులకోసం పోరాడే పోరాటంలో, బూర్జువా నిర్బంధాలకు తట్టుకోలేక సాధారణంగా మేధావులే జారిపొయే' దంటున్నాడు లెనిన్. అందుకు మీరు చక్కని ఉదాహరణ అంటున్నాను నేను.

రా: అమ్మాయ్! ఇందులో యెవరి నిర్బంధాలూ ఉండవు. శాసనం ఒప్పుకొన్న మేరకు, శాంతియుత పోరాటమే జరపాలి మనమిప్పుడు.

సో: మీరంతా కాన్‌స్టిట్యూషనల్ డెమాక్రేట్లూ యేం తిప్పలు? నేను నిసలైన విప్లవవాదిని. అసలు సిద్ధాంతయుతంగా ఆలోచించి నట్లయితే...!

పె: ఇప్పుడు సిద్ధాంత రాద్ధాంతాల రభస అక్కర్లేదు. వాస్తవిక ప్రజాజీవితానికి దూరమై పోయి, కేవలం పుస్తకాలు బట్టీబట్టి, మెదళ్ళు నింపుకొని, నోటికొచ్చినట్లు మాట్లాడ్డం, చేతికొచ్చినట్లు రాయడంవల్ల సమాజానికి కలిగే మేలు యేమీలేదు. అన్నయ్యా కాఫీ యెందుకు మానేశాడో గ్రహించండి. తన కొడుకు భవిష్యత్తు తలుచుకొని యెందుకు కటకట పడుతున్నాడో తెలుసుకోండి.

సో: నాకు తెలియందేమీ లేదులే!

పే: అన్నయ్యకోసం అన్నయ్య కొడుకు కోసం, మనకోసం మన పిల్లలకోసం, అం...

సో: మనకింకా పిల్లలు లేరులే!

పే: ఉన్నారు. దిక్కులేని పిల్లలంతా మన పిల్లలే. అందులో నాకిప్పుడు నెల... (సిగ్గు పడుతుంది.)

సో: (పిడుగు బడ్డట్టయి) నెల తప్పిందీ! కొంపార్చావు పేరిందేవీ! కొంప నిలువునా ఆర్చావు. ఇందాకట్నుంచీ మన భీముగాడు యేదో సోదిచెబుతున్నట్లు చెప్పుతుంటే ఏమిటో ననుకున్నాను.

పే: ఆరోగ్యకరంగా జీవించడానికి యీ యిల్లు యిల్లా యిది? మురికికూపం. ఇది చాలదు. వచ్చే జీతంవల్ల సంసారం నడవదు. బ్రతకడానికి కావాల్సిన సర్వ వసతుల కోసం మనం గట్టిగా అడగవలసిందే! శాయ శక్తులా పోరాడవలసిందే; మనం అంతా కుల, మత, లైంగిక భేదం లేకుండా సుసంఘటితులం కావల్సిందే. పదండి!

సో: పోదాం పేరిందేవీ పోదాం. అసలు విషయం యేమంటే...

రా: అపరా యీ విషయాలు యిహ! వసబోసిన పిట్టలాగ యింట్లో కూర్చొని నువ్వూ నీ వాగుడున్నూ. రాండి పోదాం.

భీ: పదండి. అసలే ఆలస్యమయింది.

(అందరూ కలిసి వెళ్లి ప్రదర్శనంలో కలుస్తారు)

కథానిక

# నమ్మి చెడిన వాడు

పెనుమర్తి కామేశ్వరరావు

షూటింగుకు స్టూడియోకు వెళ్ళడానికింకా గంట సమయముంది. ఆ రోజున టాకీలోకల్లా ముఖ్యమైన ఘట్టం షూటింగు జరగవలసి వుంది. ఆమె ఉదయం ఎనిమిది గంటలనుంచీ 9 గంటల వరకూ టాయిలెట్టులో, వస్త్ర ధారణలో లీనమైంది. నిలువు టద్దాని కెదురుగా నిలబడి తనకున్న పట్టుచీరెలలో జాకెట్లలో కల్లా మంచి అందమైన వాటిని తన శరీర కాంతితో మేళవించే శబలిత వస్త్రములను నిర్ధారణ చేసుకోవడంలోనే అరగంట వ్యర్థమైంది. పెట్టెలోని బట్టలన్నీ ఇస్త్రీ షాపులో వలె కుప్పగా పోసింది. ఒక్కటొక్కటే తీసి అద్దాని కెదురుగా నిలబడి చీరెని తన భుజం మీద వేసికొని మనసు తృప్తి పరుచుకోవడానికి ప్రయత్నించింది. ఇంటి వద్దనుంచి ఎంత అందంగా సింగారించుకుని స్టూడియోకు వెళ్ళినా అక్కడ తన నున్నదాన్ని వున్నట్లుగా నటించనీయక తనకు క్రొత్తగా టాకీలో తన పాత్ర కనుగుణంగా మేకప్ చేస్తారు. ఆమె తన శ్రమనంతా వృథా అనుకోలేదు. ఇంటివద్ద తనుచేసుకునే ముస్తాబు సినిమాకు పనికి రాకపోయినా, సినిమాకు సంబంధించిన వ్యక్తుల్ని ఆకర్షించడానికి ఎంతైనా ఉపకరిస్తుంది. దర్శకుడు తనవాడే గాని-ఫొటోగ్రాఫర్, సౌండ్ ఇంజనీర్, మేకప్ మాన్, కవి, సంగీత దర్శకుడు— వీళ్ళంతా ఎంతమందో తననభిమానిస్తేనే తనకు విజయం లభించేది. అందులో దర్శకుడు సుకుమార్ దర్శకత్వంలో అనుభవం లేకుండా ఆ పని కుద్యుక్తుడైనాడు. అతడు ప్రతివిషయంలో తక్కిన వాళ్ళమీద ఆధారపడి వుండటం తనకు తెలుసు. తనను ప్రేమించి సుకుమార్ - అనుభవం, విజ్ఞానంలేని తనచేత ఆ టాకీలో నాయిక వేయిస్తున్నాడు.

నిలువుటద్దంలో తన శరీరాన్ని చూచుకున్నప్పుడల్లా నిర్మల తాను జగదేక సుందరి ననుకోవడంలో తప్పేమీలేదు. ఆమె నిజముగా సౌందర్య ఖనియే కాని సినిమారంగంలో అనుభవం లేదు. వివిధ భావాల్ని ప్రకటించడంలో ఆమెకు సమయస్ఫూర్తి చాలా తక్కువ. శ్రీనాథుడు కాశీ ఖండంలో ఆటవిక సేనాధీశు సీమంతినుల్ని వర్ణిస్తూ, "వ్యామగ్రాహ్య పయోధరల్, కుటిల నీలాగ్రాలకల్, తథ్య మిథ్యా మధ్యస్థిత మధ్య"లన్నాడు. నిర్మల కూడా ఆటవిక సుందరియే. ఏ కులంలో ఏవూళ్ళో జన్మించిందో, ఏ తలిదండ్రులకు జన్మించిందో కాని- ఆమె శరీరం మిసమిసలాడుతూ, మాంజిష్ఠ